**2024(1)THCR**

**తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం, హైదరాబాద్**

**గౌరవనీయ శ్రీ జస్టిస్ కె. సురేందర్,**

**సోమవారం, ఇరవై రెండవ తేదీ, జనవరి నెల రెండు వేల ఇరవై నాలుగు**

క్రిమినల్ రివిజన్ కేసు No.764/2023

**మహమ్మద్ ఖాన్ మరియు ఇతరులు**

**వర్సెస్**

**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరియు ఇంకొకరు.**

**పిటిషనర్ల తరపు న్యాయవాది** : శ్రీ ఖాజా మొయినుద్దీన్

**ప్రతివాది నెం.1 తరపు న్యాయవాది** : అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్

**ఉత్తర్వు:**

1. ప్రస్తుత పిటిషనర్లు నిందితులు నెం. 3 నుండి 12 గా ఐపిసి సెక్షన్లు 498-A, 409,506 మరియు వరకట్న నిషేధ చట్టంలోని సెక్షన్లు 4 మరియు 6 కింద అభియోగాలు మోపబడి ఉన్నారు.

2. ఫిర్యాదుదారు తన ఫిర్యాదు లో ఈ కిందివిధంగా ఆరోపణలు చేశారు, ముస్లిం ఆచారాలకు అనుగుణంగా A1 తో తన వివాహం తేదీ 08.03.2021న జరిగిందని, వివాహ సమయంలో రూ. 5 లక్షల నగదు, పది తులాల బంగారం కట్నం రూపంలో ఇవ్వడమైనదని, వివాహం మరియు విందు భోజనాల కోసం పెద్ద మొత్తంలో ఖర్చు చేయబడ్డాయని ఫిర్యాదుదారు/ఒకటో ముద్దాయి (A1) తో కలిసి జీవించడం ప్రారంభించిన తరువాత, ఆమె పట్ల A1 దురుసుగా ప్రవర్తిం చేవాడని, నిందితులు రాడో బ్రాండ్ వాచ్ మరియు రూ .5.00 లక్షలు అదనపు కట్నం గా డిమాండ్ చేశా రని. అదనపు కట్నం ఇవ్వనందున, వేధింపులు పెరిగాయని మరియు అత్తగారు ఆమెను పాడైపోయిన ఆహారం తినమని బలవంతం చేశారని మురికిగా, మానవ నివాసానికి అనువుగా లేని గదిలో ఆమెను ఉంచారని ఫిర్యాదు చేసింది.

3. ఇంకా, ఫిర్యాదుదారు కేసు ఏమిటంటే, ఆమె గర్భవతి అయిందని, వేరొకరితో సంబంధం కలిగి ఉందని అనుమానించి A1 ఆమెను గర్భస్రావం చేసుకోమని చెప్పాడని, అదనపు కట్నం కోసం చేసిన అభ్యర్థనను ఆమె తన తల్లికి తెలియజేసిందని, దీంతో తన తల్లి రాడో బ్రాండ్ వాచ్ ఏర్పాటు చేసిందని, అయినా కూడా నిందితుడు Rs.5.00 లక్షలు డిమాండ్ చేయడం ప్రారంభించా రని వేధింపులను

భరించలేక మరియు వరకట్నం మరియు వివాహానికి అయిన ఖర్చుల మొత్తం రూ. 16.00 లక్షలు కావడం మూలాన ఫిర్యాదు దాఖలు చేసింది. దర్యాప్తు అనంతరం, చార్జ్‌షీట్ దాఖలు చేయటం జరిగింది.

4. ప్రస్తుత పిటిషనర్లలో ఎవరిపైనను ప్రత్యేక ఆరోపణలు లేవని పేర్కొంటూ, కేసు నుండి తమను విడుదల చేయాలని కోరుతూ ట్రయల్ కోర్టు ముందు సెక్షన్ 239 Cr.P.C కింద పిటిషన్ ను దాఖలు చేశారు.

5. హైదరాబాద్ లోని 15వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ C.C.No.2489/2022 లోని Crl.M.P.No.2632/2023 లో తేదీ 08.09.2023న పిటిషనర్లను విడుదల చేయడానికి నిరాకరిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. ప్రాసిక్యూషన్ సాక్షుల వాంగ్మూలాలు పిటిషనర్లపై కేసును ప్రాథమికంగా రుజువు చేస్తా యని, కేసు ప్రారంభ దశలో ఉన్నందున పూర్తి స్థాయి విచారణ నిర్వహించకుండా, పిటిషనర్లను కోర్టు విడుదల చేయజాలదని, అంతేకాకుండా, నిందితులు గౌరవప్రదమైన కుటుంబాలకు చెందినవారు కావడం మరియు వారిలో కొంత మంది మహిళలు విడివిడిగా నివసిస్తున్నవారు కావడం వల్ల మాత్రమే ఈ కేసులోని వాస్తవాలను మరియు పరిస్థితులను కోర్టు పరిశీలించాల్సిన అవసరం లే దంటూ పై దరఖాస్తును చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కొట్టివేశారు.

6. ఫిర్యాదును, దర్యాప్తు అధికారి నమోదు చేసిన సాక్షుల వాంగ్మూలాలను పరిశీలించిన తరువాత , సాక్షులెవరూ ఈ పిటిషనర్ల పేర్లను ప్రస్తావించడం మినహా వారికి వ్యతిరేకంగా ఏమీ చెప్పలే దని తెలుస్తుంది. ఈ పిటిషనర్లలో ఏ ఒక్కరి ప్రమేయాన్ని చూపించే ఒక్క సంఘటన లేదా ఉదాహరణను కూడా వివరించబడలేదు. దర్యాప్తు సమయంలో విచారించబడిన సాక్షులు ఎవరూ వారిపై ఆరోపణలు చేయనప్పుడు, ఈ పిటిషనర్ల పేర్లను నిందితులుగా చేర్చడానికి పోలీసులకు ఆధారం ఏమిటో తెలియదు.

7. కేసులోని వాస్తవాలను, పరిస్థితులను కోర్టు పరిశీలించాల్సిన అవసరం లేదనుకోవడంలో దిగువ కోర్టు పొరపాటు చేశారు. నిందితులను విడుదల చేయడానికి సెక్షన్ 239, 227 Cr.P.C లను ప్రవేశపెట్టడంలో చట్టం యొక్క ఉద్దేశం ఏమిటంటే , ప్రాథమిక ఆధారాలు లేని వ్యక్తులపై ప్రాసిక్యూషన్ కొనసాగకుండా చూడటం. ప్రాథమిక కేసు యొక్క విషయం పక్కన పెడితే, పిటిషనర్ల పేర్లు ఫిర్యాదులో కానీ , సాక్షులు ఇచ్చిన వాంగ్మూలాల్లో కానీ ఎక్కడా పేర్కొన బడలేదు. పిటిషనర్లను విడుదల చేయడానికి మేజిస్ట్రేట్ సెక్షన్ 239 Cr.P.C కింద అధికారాన్ని ఉపయోగించి ఉండాలి.

ఇలాంటి నిష్ప్రయోజనమైన ప్రాసిక్యూషన్ ను ఆదిలోనే కొట్టివేయాలి. విచారణ న్యాయస్థానాలు నిందితుడిగా పేర్కొనడానికి ఎలాంటి కేసు లేనప్పుడు నిందితుడిని నిస్సంకోచంగా విడుదల చేయాలి మరియు ఛార్జ్ షీట్ లో పేరు ఉన్న కారణం చేత మాత్రమే నిందితులను క్రిమినల్ విచారణ పరిధిలోకి తీసుకురాకూడదు.

8. ఈ పిటిషనర్లలో ఎవరిపైనా ఎటువంటి నిర్దిష్ట ఆరోపణలు లేనందున, సదరు పిటిషనర్లపై క్రిమినల్ చర్యలను కొనసాగించడం అనేది కోర్టు ప్రక్రియను దుర్వినియోగం చేయడం తప్ప మరొకటి కాదు. విచారణ న్యాయస్థానాల సమయం విలువైనది మరియు చాలా కేసులు పెండింగ్ లో ఉన్నాయి. నిందితులను దోషిగా నిర్ధారించే అవకాశం దాదాపు శూన్యంగా ఉన్న అటువంటి కేసులపై విచారణ న్యాయస్థానాలు సమయాన్ని వృధా చేయలేవు. రికార్డులో ఎటువంటి సాక్ష్యము లేనప్పుడు, అది నేరం అనే అనుమానాన్ని కూడా సృష్టిస్తుంది , కావున విచారణ ముగిసే వరకు వేచి ఉండకుండా నిందితులను విడుదల చేయాలి.

9. తద్వారా, క్రిమినల్ రివిజన్ కేసును అనుమతిస్తూ C.C.No.2489/2022 లో పిటిషనర్లు A3 నుండి A12 లను విడుదల చేయడానికి ఉత్తర్వులు జారీ చేయడనైనది . పర్యవసానంగా C.C.No.2489/2022 లో Crl.M.P.No.2632/2023 తేదీ 08.09.2023 నాడు జారీ చేసిన ఆక్షేపిత ఉతర్వు కొట్టివేయబడినది.

ఇతర అప్లికేషన్లు ఏవైనా ఉంటే అవి ముగించబడ్డాయి.